
పెద్ద కథ



జూన్ నెల. మృగశిర కార్తె సగం పాదం దాటింది. వర్షాలు లేవు. పట్టణాల్లో, పల్లెల్లో జనం నీళ్ళ కోసం అల్లాడుతున్నారు. ఎండలు 'మే' నెలను మరిపిస్తున్నాయి. ఐనా స్కూళ్లు తెరిచారు. వేసవి సెలవలు ముగిశాయి – వేసవి వుంది. వేడీ వుంది. సాయంకాలం ఐదు గంటలు దాటినా అలాగే కూర్చొని వున్న సుజాత విపరీతమైన ఉక్కపోతకు తాళలేక తన కొంగుతో గాలి విసురుకుంటోంది.

బడి ఆవరణ అంతా మైదానంలా వుంది. వుండి వుండి వీచే వడగాలి చెంపలు చరిచేస్తోంది. పొద్దు తిరిగిపోయినా కళ్ళు మిరిమిట్లు గొలిపే ఎండతో ఆమె విశాలమైన చక్కటి కళ్ళు చిన్నబోయి వున్నాయి. వెలుగులు చిమ్మే ఆమె ముఖం కందిపోయినట్టున్నది. బడి గదిలో ఒక్కతే కూర్చొని వుంది. పిల్లలు ఇళ్ళకు వెళ్ళిపోయారు. ఇక తనూ బయలుదేరే ప్రయత్నంలో వుంది. ఇంతలో ఎవరో అటుగా వస్తున్న చప్పుడు వినిపించింది. అటు దిక్కు చూసింది.

# బొడ్రాయి

## ..భూపాల్...

ఊరి కావలికాడు వెంకటయ్య. అతన్ని అందరూ వెంకటీ అంటారు. కాళ్ళకు చెప్పులు లేవు. పంచె పైకి ఎగకట్టాడు. బనియన్ తొడిగాడు. చేతిలో కర్ర వుంది. భుజం మీద చిన్న తుండుగుడ్డ లాంటి టవల్, బట్టతల, అతను వస్తూనే... నమస్కారం చేస్తూ "పోతున్నవా అమ్మా?" అన్నాడు.

"అవును వెంకటయ్యా! ఈ ఎండకు తట్టుకోవడం కష్టం గుంది. ఊరి బయట గధా వడగాలి. చెట్లు లేవాయె. సర్కారోళ్ళు బడి తెరువాలన్నారు. నీళ్ళు లేవు. కరెంటు లేదు. ఎండకు పిల్లలు మాడి చస్తారేమోనని నా భయం. వాళ్ళను తొందరగానే వదిలేసిన మూడు గంటలకే. ఇక నేను కూడా పోదామని లేస్తున్న" అని "చెప్ప ఏమో పని మీదొచ్చినవు? ఎవరి నన్న స్కూళ్ల చేర్పిస్తవా?" అడిగింది సుజాత.

"నాకు అంత చిన్న పిల్లలెవరున్నరమ్మా? పెద్ద పటేలు పంపిస్తె వొచ్చిన" అన్నాడు వెంకటయ్య.

"ఎవరూ! కోదండరావు పటేలా?! నా దగ్గరికా? అంత పనేం పడ్డదమ్మా! ఏందటా?"

"రాత్రికి ఊరి బొడ్రాయికాడ పంచాది వుంది. ఆడికి నిన్నూ, మీ మహిళామండలి కెళ్లి ఇంకెవరి నన్నా తోల్కొని రమ్మన్నడు కోదండం పటేలే!"

"పంచాదులుంటే డప్పు చాటిస్తరు గదా? ఇట్ల చెప్పడేందీ?"

"అమ్మా! ఈ పంచాది పిల్లజెల్లలు ఇనేది కాదట. అందుకోసమే డప్పు చాటించలే! రాత్రిపూట పెట్టిందీ గందుకేనట."

"పెద్దలకు మాత్రమేనా? అంత రహస్యమేందీ? కోమటిండ్లు రెండే వున్నాయి గదా! ఎవరింటి కొట్లాట ఇదీ?"

"లోపటి సంగతేందో నాకూ దరి ఆనలేదమ్మా! ఇది ఆ రొండిండ్ల పంచాది లెక్కనే వుంది" అన్నాడు వెంకటయ్య.

అతన్ని ఇంకా వివరాలు అడిగి లాభం లేదనుకుంది సుజాత. "సరే! ఎన్ని గంటలకి?" అని అడిగి "మరి అంత బయటకి చెప్పకోలేని పంచాదే ఐతే ఎవ్వరింటి దగ్గరన్నా పెట్టొచ్చుగదా! బొడ్రాయికాడెందుకూ?" అంది.

"నైట్ ఆల్టు (హాల్ట్) ఆఖరు బస్సు పోయినంక, బువ్వలు దిన్నంక రమ్మన్నరు. బొడ్రాయి కాడనే అన్నరు. ఆడ యాపచెట్టుంది గదా! సుట్టూ అరుగు కట్టిండ్రు. కూసుంటందుకే... ఇప్పటిదా అమ్మా ఆ బొడ్రాయి. ఊరు పుట్టిన నాటిది. మా తాత ముత్తాతలూ పంచాదులు ఆడనే తెంపుకుండ్రట. అసలు బొడ్రాయి నిజంగా

ఊరి నడుమనే వుండేదట.

ఆడ తెగిన పంచాది  డిల్లీల పెద్ద కోరట్‌ల (కోర్టులో) చేసిన తీర్మానం లెక్కనే వుండేదట. అప్పటి ధర్మం ఇప్పుడు కనవ డుతలేదంటరు జనం. ఇగ బొంద్రాయా...?! ఊరు పది ఒంకలు తిరిగింది. ఎవ్వరికి తోచినట్టు ఆల్లు ఇండ్లు కట్టుకున్నరు జనం. నీళ్ల వాసతినీ, కుల పోళ్లను జూసి. ఇప్పుడు బొంద్రాయి ఓ మూలకు నక్కినట్టే అవిపిస్తది. ధర్మకాలం నక్కినట్టు పూర్వమెప్పుడో ధర్మకాలముండేదన్న నమ్మకమున్న వెంకటయ్య అలా ఆగకుండా చెప్పేసి "అమ్మా ఇగ నేను పోత" అన్నాడు.

ఆమె "సరే" అంది.

అతను ఇంత కథ చెప్పిన కారణం సుజాత టీచర్‌కి అర్థమైంది. పంచాదులు తీర్మానమైతే బొంద్రా(ఇ) దగ్గరే కావాలని అతను అనుకుం టాడు.

వెళ్లిపోతున్న అతని పాదాల వైపు మరోసారి చూసింది సుజాత. నిప్పుల వర్షంలాంటి ఎండకు వేడెక్కిన నేల అతని పాదాలను ఏమీ చేయలే కుంది. అవి రాళ్లలా గట్టిగా రాటుదేలి వున్నాయి. ముళ్ళు తొక్కినా పాదంలో దిగవేమో, విరిగిపోతా యేమో అనుకుంది.

'ఎప్పుడూ ప్రత్యక్షంగా ఏ పంచాదికీ పిలవంది ఈసారి తనను ఎందుకు పిలుస్తున్నాడో కోదండం? ఇది ఆడవాళ్ల కొట్లాటనా? అక్కడ జరిగే నిర్ణయా లకూ, తీర్పులకూ నా ప్రతిస్పందన చూడాలనుకు న్నాడా? అతనికి నా మీదున్న కోపం, అసమ్మతీ ఈ రూపంలో అక్కడికి పిలిచి తీర్చుకుంటాడా?' ఇలా ఆలోచిస్తూ స్కూలు గదికి తాళం వేసి సుజాత తన ఇంటి వైపు వెళ్లలేదు. నేరుగా గొల్లకుర్మల వాడకట్టు చేరింది.

ఆ ఇంటి ముందు పులివాయిలి కర్రలతో తడ కలు కట్టి వున్నాయి. మధ్య నుండి దారి. ఒక వైపు తడకల మీద పారిన కాకరపాదు. తీగ ఎప్పుడో ఎండిపోయింది. ఆ పాదు కాయలు ఎన్నోసార్లు తిన్నది తాను. తడిక దాటి లోపలికి అడుగుపెట్టగానే ఎదురుగా పెంకుటింటిముందు వేసుకున్న పాక కింద కుదురు మీద కూర్చొని వుంది కురుమచెంద్రమ్మ. రెండు తొడల మధ్యకి చీర దోపుకుని, పక్కనే కుండలో భద్రంచేసి వున్న



గొర్రె బొచ్చు ఎడమ చేత్తో తీసుకుంటున్నది. నేల మీద తిరుగుతున్న కదురు దారాన్ని చుట్టుకుంటూంటే, కదురుకీ ఎడమ చేతికీ మధ్య తొడ మీద కుడి చెయ్యి రాసి పేనిన దారం సుళ్ళు తిరుగుతూ విచిత్రంగా కనిపిస్తోంది.

సుజాతను చూసిన చంద్రమ్మ చేస్తున్న పని ఆపి "రా! టీచరమ్మా" అంటూ నవ్వుతూ ఆహ్వానించింది. చెంద్రమ్మ సుజాతకి తల్లి వయసులో వుంటుంది.

"నువ్వు పని ఆపకు" అంటూ వెళ్ళి పక్కనే అరుగులా వున్న గోడ మీద కూర్చుంది సుజాత. ఎర్రమట్టితో అలికిన ఆ గోడకి సున్నం బొట్లతో, గీతలతో చిత్రించిన బొమ్మలు ఎంతో ముచ్చటగా వున్నాయి.

గాలి ఆడడం లేదు. పాక నిండా గొర్ల గొతికెల వాసన. కొంచెం దూరంలో గెగ్గెతట్ట. తట్టలో మూడు మేక పిల్లలు పడుకొని వున్నాయి. టీచర్ దిక్కే చూస్తున్నాయి. ఎంతో అందంగా, సోయగం ఉట్టిపడుతున్న వాటిని చేతుల్లోకి తీసుకోవాలని పిస్తోంది ఆమెకు. "చంద్రమ్మా! మేకపిల్లలెంత బాగున్నాయో? ఎత్తుకోవాలనిపిస్తోంది" అంది.

చంద్రమ్మ నవ్వి "మేకపాలున్నయ్. ఛాయ చెయ్యనా? తాగుతవా టీచరమ్మా" అంది.

"టీ తాగాలనే వుంది. కానీ మేకపాలు నాకు పడవు ఇంకా! కొంచెం వాసనగా వుంటాయి గదా. ఇప్పుడు ఆ ప్రయత్నం ఏమీ వద్దుగనీ, కావలి వెంకటయ్య నీ దెగ్గరకి వచ్చి ఏమన్నా చెప్పిండా?" అని అడిగింది.

"ఏదీ ఏం రాలేదు. బడికాడికొచ్చినాడు?"

"అవును. ఇంతకు ముందే. రాత్రికి ఏదో పంచాది చేస్తరట. ఆడికి మనల్ని రమ్మని కోదండం పటేలు కబురు జేసిండు. ఆ కొట్లాట సంగతి నీకేమన్నా తెలుసా?"

"నేననుకుంటనే వున్న. ఎంతకాలం మూసుకుంటరని. మూసి పెడితె పాసిపోతదంటరు" కొంచెం వెటకారంగానే అంది చంద్రమ్మ.

"ఏందీ అసలు సంగతి జెప్పు" అడిగింది సుజాత.

"ఈ ఊరికి తూర్పునుండే జానకమ్మ బిడ్డె పద్మ. ఆ పిల్లను ఈ వాడకట్టు దెగ్గెరున్న కోటిలింగం కొడుక్కు ఇచ్చి పెండ్లి జేసిండ్రు. జానకమ్మ ముండమోసింది. కొడుకులు లేరు. ఒక్కతే బిడ్డె. అదే ఈ పద్మ. రేపు జానకమ్మ చస్తే దాని సంపాదన మంతా తనకే మిగుల్తదని కోటిలింగం ఉపాయంతోని కోడల్ని దెచ్చుకుండు. ఆ కోటిలింగం కొడుకు రామలింగం. ఆడు దుబాయి దేశం బొయ్యి మూడేండ్లు దాటింది. అప్పటికే యాడాది ముందల పెండ్లిజేసుకుండు. అట్ల పోయినాడు ఇయ్యాలటికి నాల్గు రోజులాయె ఊళ్లెకొచ్చి. ఒచ్చిసూస్తె ఏముంది ఆని పెండ్లాం పద్మకు ఎనిమిది నెలల పొట్టతోటుందట. అదమ్మా సంగతి" అని చెప్పింది చంద్రమ్మ.

ఇంకా కొన్ని వివరాలు అడిగి తెలుసుకుంది సుజాత. తర్వాత "చూడు చంద్రమ్మా! ఈ పంచాదికి మనల్ని పిలుస్తున్న పటేలు మనం ఏం చెపుతామో చూద్దామనేగనీ, ఇంకెందుకూ గాదు. మహిళామండలిని మనం స్థాపించడం, కొన్ని పనులు చేయడం, కొన్ని విషయాల్ల నిలదీసి అడగడం ఆయనకు మంట లేస్తూంది. ఈ పద్మ తప్పు చేసిందనీ, ఆడజాతికి మచ్చ తెచ్చిందనీ, దాన్ని మహిళామండలి ఎట్ల తీసుకుంటదో చూద్దామనే ఆయన ఆలోచన. ఐనా పద్మ ఎందుకు ఇట్ల చేసిందో మనం తెలుసుకోవాలె. ఏ దశలో చేసిందో గమనించాలె. నాల్గు నెలల కింద కడుపు తీయించుకుంటె ఈ సంగతి బయటపడేదా? పడకపోతుండె గదా! అట్ల జేసెటోళ్ళు ఎంత మంది లేరు! వీళ్ళెందుకు చేయలేదంటే ఏదో వుంది. పోనీ తెలువని ఎడ్డి మనుషులా అంటే అదీ కాదుగా! రేపు పిల్లను కంటవనీ పద్మకు తెలిసే వుంటది. లోకం కోడై కూస్తదనీ తెలిసే వుంటది. మరి ఎందుకు భయపడలేదు! అంటే ఏదో తిరకాసు వుంది. నిజమే నువ్వన్నట్టు మూసిపెట్టాలనే పెట్టిందా! ఇంకా దాచుకోవాలనే వుందా? మనం కనుక్కోవాలి. ఒకరి మీద నింద వేసే ముందు ఎందుకు అట్ల జరిగిందో చూడకపోతే మనం గూడ తప్పుగ లెక్కేసుకుంటం. నువ్వు చెప్పిన ముచ్చటబట్టి చూస్తే పద్మ అత్తగారిని కూడా చాలా తప్పులుండాలనే అనిపిస్తూంది" అంది. అప్పటికే చీకటి పడింది. మాట్లాడుతూనే తను చేసే పని ఆపి ఇల్లు ఊడ్చింది, కుండలు కడిగించి, దీపం పెట్టింది చంద్రమ్మ.

(సశేషం)

## 'దేశిరాజు' 'నేమాన' / 'నేమాని' ఇంటిపేర్లు ఎలా వచ్చాయి?

దేశిరాజు: ఇది వ్యక్తి నామపదంగా వచ్చిన ఇంటిపేరు. సంస్కృత శబ్దం 'దేశ'. ఈ పదానికి ప్రాంతము, చోటు అనే అర్థాలున్నాయి. దేశిక శబ్దానికి గురువు, ఉపాధ్యాయుడు (ముఖ్యంగా ఆధ్యాత్మికోపదేశం గావించేవారు) అనే అర్థాలు వున్నాయి. బ్రాహ్మణేతర కులాలకు సంబంధించిన పురోహితులకు కూడా దేశిక శబ్దం బిరుదు నామంగా చెల్లివస్తుంది. వ్యాపారికి, మఠాధిపతికి, యాత్రికునకు, విదేశీయునికి, వైష్ణవాచార్యునికి కూడా దేశిక శబ్దం వర్తిస్తుంది. వైశ్య కులంలో దేసు ఇంటిపేరు గలవారు వున్నారు. మహారాష్ట్ర బ్రాహ్మణుల్లో ఒక తెగకు దేశస్థ బ్రాహ్మణులని పేరు.

ఇక తేజస్సు అనే సంస్కృత శబ్దం కూడా కన్నడంలో దేశి అయింది. ఈ శబ్దానికి, అందగాడు, విలాసవంతముగా జీవించేవారు (సుఖభోగి) అనే అర్థాలున్నాయి. దేశిరాజులోని దేశి శబ్దం ఉపాధ్యాయుడు అనే అర్థంలోగాని, తేజస్సంబంధమైన కన్నడ శబ్దార్థంలోంచి వచ్చి యుండవచ్చు. దేచ శబ్దం వ్యవహారపరంగా శైవసాహిత్యంలో కనిపిస్తుంది. దేచవరం అనే గ్రామం కూడా వుంది. దేసింగ శబ్దం మాత్రం దేవసింగ నుండి ఉత్పన్నమైంది. దేవతా శ్రేష్ఠుడు అని అర్థం. శివునికి కన్నడంలో దేసింగరాయడనే వ్యవహారముంది.

రాజు శబ్దం ప్రభువు, అధిపతి అనే అర్థాల్లో తెలిసిందే. ఇంటి పేర్లలో కనిపించే రాజు, అధికారార్థ సంబంధి. ముఖ్యంగా ఇలాంటి గృహనామాలు తెలుగునాట నియోగి బ్రాహ్మణుల్లో అధికం. మరి వారే నిన్న మొన్నటివరకు ప్రధానంగా గ్రామాధికారులు.

నేమాన/నేమాని: నియమ అనే సంస్కృత పదం నేమగా పరిణమించిందనే సంగతి తెలిసిందే. ఈ నియమ శబ్దం కట్టడి. అనుసరించదగిన పద్ధతి. విధి విధానము-ఇలాంటి అర్థాల్లో ప్రవర్తిస్తుంది. పదం సంస్కృతమే అయినా గృహనామమైన నేమాన మాత్రం తమిళం నుండి సంక్రమించింది. నేమాన్ అంటే ఆదర్శప్రాయమైన ప్రవర్తన గలవాడని అర్థం. అది తెలుగులో నేమానగా రూపొందింది. షష్ఠీవిభక్తిక రూపం దాల్చి నేమాని అయింది. ఈ గృహ నామం ప్రచారంగా బ్రాహ్మణ కుటుంబాల్లో కనిపిస్తుంది. ఇతరుల్లో కూడా వుందేమో తెలియదు.

మీ ఇంటిపేరెలా వచ్చింది?

తెలుసుకోగోరినవారు ఈ చిరునామాకు రాయండి:



డాక్టర్ యార్లగడ్డ బాలగంగాధరరావు
తెలుగు ప్రొఫెసర్, నాగార్జున యూనివర్శిటీ,
నాగార్జుననగర్-522 510